ఆశా కిరణం

వెంకటేశ్వర్లు తిరిగి తిరిగి ఒంటిగంట దాటాక యింటికి వచ్చాడు. అతనికి ఎక్కడా బియ్యం దొరకలేదు. ఇంక దొరకవనీ తాను సంపాదించ లేననీ తెలిసికూడా ఊరికే వెర్రిగా పిచ్చిగా అలాతిరిగాడు. ఆకలీ, నిస్పృహ శీతాకాలపు మధ్యాహ్నపు ఎండా– మూడూ అతన్ని విమూఢుణ్ణి చేశాయి. ఆఖరికి ఓ బియ్యం కొట్టువద్దకు వెళ్ళాడు. యాచించాలని అతని ఉద్దేశ్యం. కాని "బస్తా ఎంత?" అని అడిగాడు. షాహుకారు యితని వెర్రివాలకాన్ని చూసి ఓ క్షణం సందేహించి "ఎనభై రూపాయలు" అన్నాడు.

"ఓహో" అని వెనక్కి తిరిగాడు వెంకటేశ్వర్లు. దారిలో సత్రం అరుగుమీద కూర్చున్నాడు కాస్సేపు. ముష్టివాళ్ళు కుండల్లో అన్నం వండుకుంటున్నారు. వాళ్ళకేసి ఆశగా ఈర్ష్యగా చూశాడు అతనికి తెలియకుండా కన్నీళ్ళు వచ్చాయి. చిన్నప్పుడేడిస్తే అమ్మా, నాన్నా ఓదార్చేవారు. ఇప్పుడు పెళ్ళాం తిడుతుంది. పిల్లలు తెల్లబోయి చూస్తారు, అతను ఆకలికే ఏడవలేదు. బియ్యం దొరకలేదని ఏడవలేదు. అతను నిస్సహాయుడై ఏడ్చాడు. చాతకానివాడై ఏడ్చాడు. అతని ఏడుపుకి బలం లేదు. గుండెల్నీ గాలినీ చీల్చుకుని కొండలలో ప్రతిధ్వనించే ఆక్రోశం కాదు. బురదలోవున్న వానపాముమీద అడుగేసినప్పుడు ఆ వానపాము గిలగిలలాడి నీరసంగా నిశ్శబ్దంగా చచ్చిపోవడం లాంటి ఏడుపు. అసమర్థుడి అసహ్యమైన ఏడుపు.

కళ్ళు తుడుచుకొని అలా అలా నడచి వంతెన దాటి కాలవ వొడ్డున కొంతదూరం నడిచి మళ్ళీ వెనక్కి తిరిగి ఊళ్ళోకి అక్కడ నుంచి తిన్నగా యింటికి వచ్చాడు. భయం భయంగా యింట్లో అడుగు పెట్టాడు. వీళ్ళందరికీ ఏమని చెప్పడం ? వీళ్ళందరూ – పెళ్ళామూ, అయిదుగురు పిల్లలూ ఏ ఆకలివల్లనో చచ్చిపోయి పడివుంటే అతనికి ధైర్యమూ కులాసా కలిగేది. వాళ్ళు బియ్యం తేలేదేమని అడగరు. నిందాగర్భితంగా కసిగా దీనంగా తనకేసి చూడరు. కాని వాళ్ళలాగ చచ్చిపోలేదు. నడవలో నేలమీద భార్య కొంగు పరుచుకొనివుంది. ఇతను రాగానే కళ్ళు తెరచి శూన్యంగా చూసి మళ్ళీ మూసుకొంది. 'అమ్మయ్య' అనుకొని గదిలోకి వెళ్ళబోయాడు. పెద్దకూతురు జయ గోడనానుకుని వొళ్ళో చంటివాణ్ణి వేసుకొని కూర్చుంది. ఆమె వాసాలకేసి చూస్తోంది. తడిలేని పెదవులతో. తక్కిన పిల్లలెక్కడున్నారో కనపడడంలేదు. వెంకటేశ్వర్లు కూతురుకి కూడా కనపడకుండా పెరట్లోకి వెళ్ళాడు. నూతిలోంచి నీళ్ళుతీసుకొని కాళ్ళూ ముఖమూ కడుక్కొని బాదం చెట్టుకింద చతికిలపడ్డాడు.

౬

అతనికి వొంట్లో నీరసం ఎక్కువవుతోనట్టనిపించింది. ఒక్క క్షణంమాత్రం నుయ్యీ, బాదంచెట్టు, చెట్టుమీద కాకి గుండ్రంగా తిరిగాయి. అలాగే ఎండుటాకులమీద మేనువాల్చాడు. అతనికి వొళ్ళు బిగుసుకుపోతూన్నట్టు చచ్చిపోతూన్నట్టు అనిపించింది. భయంవేసింది. చచ్చిపోవాలన్న ఆలోచన అతనికి చాలా సార్లు కలిగింది. కాని యిలాగ వార్నింగ్ లేకుండా చచ్చిపోవడంకూడా చాతకాని వాడి పని అనిపించింది. "నేను వెధవని, వెధవన్నర వెధవని చచ్చువెధవని" అనుకున్నాడు. అతని కళ్ళమ్మట బొటబొట నీళ్ళుకారాయి. "బాబూ పేదవాణ్ణి రెండు రోజులున్నుంచి తిండిలేదు. కొద్దిగా బియ్యం యిప్పించండి బాబూ కరుణించండి" అని బియ్యంకొట్టువాణ్ని వేడుకుంటే యిచ్చేవాడేమో! ఎందుకు తా నాపని చెయ్యలేక పోతున్నాడు ? తాను చాతకాని వాజమ్మ కాబట్టి. ముష్టివాళ్ళు బతుకుతున్నారు. కాకులూ, గాడిదలూ బతుకుతున్నాయి. తనే బతకలేక పోతున్నాడు.

ఇంటికి రాగానే భార్య తనని తిడుతుందని అనుకున్నాడు. కాని ఆమె ఏమీమాట్లాడలేదు. అతనికో అనుమానం కలిగింది. వీళ్ళందరూ ఎక్కడేనా బియ్యం సంపాదించి వండుకు తిన్నారా ? మరి తనకి పెట్టలేదేం ? ఎవరూ పిలవరేం ? అతనిలో ఆశ కదిలింది. మెల్లగా లేచి వంటయింట్లోకి చప్పుడు గాకుండా వెళ్ళాడు. అన్నంగిన్నె మూత తీసి చూశాడు. లోపల అన్నంవుంది ఓ పక్కగా యింతఏదో పచ్చడి కూడా వుంది. ఇటూ అటూ భయంగా చూసి పచ్చడితో అన్నం గబ గబా కలిపి నోట్లో పెట్టుకోబోయాడు. గభాల్న తలుపు తోసుకుని అతని భార్య వచ్చి అతని రెక్క పట్టుకుని వెనక్కి లాగింది.

"ఉదయం అనగా బియ్యం తీసుకొస్తానని వెళ్ళావు. ఇప్పుడొస్తావా ? నేనూ పిల్లలూ ఏమౌతామనుకున్నావు ? పాపం పెద్దపిల్ల ఎన్ని కొంపలో తిరిగి ఓ అర్ధశేరు బియ్యం ఎలాగో తీసుకొచ్చింది. లేనిదే - నిన్నరాత్రి తిండిలేక యిప్పుడూలేక నీకళ్ళు చల్లగా పిల్లలు చచ్చి వుండే వాళ్ళు. నీకేం ఎక్కడో యింత బొక్కివుంటావు. వెర్రివెధవ నాలుగో వాడు యిన్ని మజ్జిగ నీళ్ళు ఎవరినేనా అడిగి తెచ్చుకుంటానని వెళ్ళాడు. అన్నం తినకుండా. వాడికోసం అట్టేపెట్టిన అన్నం దొంగలా వచ్చి కాజేద్దామనుకున్నావా ? కన్న కొడుకు కడుపునే కొడదామనుకున్నావా ! ? ఆమె చాలా గట్టిగా ఆవేశంగా అరిచింది అంతలోనే అక్కడేకూలబడి వెక్కివెక్కి ఏడ్చింది. వెంకటేశ్వర్లు నరనరాలు పీక్కుపోయాయి. అతనికేదో అసహ్యం - నోట్లో ఏదో అశుద్ధం పెట్టినట్లు - కలిగింది. అతని మీద అతనికే అసహ్యం కలిగింది. అతనికి పెళ్ళాన్నిచూస్తే జాలికలిగింది. కాపురానికొచ్చిన కొత్తలో ఆమె ఎంత శాంతమధురంగా వుండేది. ఇప్పుడెందుకిలా అయిందో అతనికి తెలుసును. అతను ఓదార్చాలనుకున్నాడు. ఏదో చెప్పాలనుకున్నాడు. కాని అక్కడ నుంచి లేచి మళ్ళీ వీధిలోకి వెళ్ళిపోయాడు.

అతను తిరిగి సత్రంవద్దకువెళ్ళి అరుగుమీద ఓమూలగా కూర్చు న్నాడు. ముష్టివాళ్ళు కొందరు అరుగుమీద పడుకుని కబుర్లు చెప్పు

కుంటున్నారు. ఎవరితాలూకు కుండలూ బట్టలు వాళ్ళదగ్గర వున్నాయి. మాసిపోయిన చీలికలైన బట్టలూ, సంస్కారంలేనిజుట్టూ, సిగ్గూ, సఖ్యత లేకుండా కనపడే దుమ్ముకొట్టుకుపోయిన మొహాలూ - మురికికాల్వల్లో గుంపులు గుంపులుగా కూడే ఓరకం పురుగుల్లా వున్నారు. తననీ తన బట్టల్నీ చూసుకున్నాడు. వాళ్ళకీ తనకి ఎంతో తేడా కనపడలేదు. అయితేవాళ్ళు బతుకుతున్నారు. ఎలాగో అలాగ బతుకుతున్నారు ఇంత అసహ్యంగా ఎందుకుబతకడం ! బతుకుమీద యింతమమకారం ఎక్కడనుంచి పుట్టుకొస్తుంది ? కాళ్ళూ కళ్ళూ లేకపోయినా రోడ్లవార డేకుతూ "అమ్మా కబోదిని" అంటూ అరుస్తూ ఆక్రోశిస్తూ చస్తూ ఎందుకు బతుకుతారు ? ఈ బతకడంలోని ఆకర్షణలో ఉన్న దగా అతనికి చటుక్కున తెలిసినటనిపించింది ఇది పచ్చిమోసం. వెధవల్నిచేసి చేపల్ని చేసి గాలానికికట్టి ఒక్కొక్కసారి నీటిలో ముంచుతూ ఆశపెడుతూ ఎవడో యింతమంది మనుష్యుల్ని కొంచెం కొంచెం చంపేస్తున్నాడు. ఏడిపిస్తున్నాడు. చిత్రవధ చేస్తున్నాడు.

వెంకటేశ్వర్లు దీర్ఘంగా నిట్టూర్చాడు. అతను చచ్చిపోవాలని నిశ్చయించుకున్నాడు బతకడంకన్న బరువైన బాధైన దింకొకటి లేదని పించింది. తాను బతకలేడు. తన కుటుంబాన్ని బతికించలేడు. తాను చాతకానివాడు. తనలాంటి నిర్భాగ్యుల్నీ నిరుపాయుల్నీ దేవుడెందుకు సృష్టించాలి. సత్రం గోడనానుకుని కళ్ళుమూసుకుని తనజీవితాన్ని పర్యావలోకనం చేసుకున్నాడు వెంకటేశ్వర్లు.

తనకీ కష్టపరంపరలు తన ఉద్యోగం పోవడంతో ప్రారంభమయాయి. ఎలిమెంటరీ స్కూల్లోమేష్టారై ఉన్నన్నాళ్ళూ ఏదోవిధంగా తిండి గడిచిపోయేది తనకీ తనకుటుంబానికీ. కాని తానుతెలివి తక్కువ వాడు. వెర్రివెధవ. లేనిదే స్కూళ్ళ యిన్స్పెక్ట్రిస్ కొంగుపట్టుకు ఎందుకు లాగుతాడు ? తనకేం దుర్బుద్ధిలేదని అంటే ఎవరు నమ్ముతారు? ఆవిడ రెండురోజులూ ఇన్స్పెక్షనుకు వచ్చి తనతో హాస్యం చేస్తూ ఎందుకు మాట్లాడింది ? తననీ తన క్లాసునూ పరీక్షిస్తూ ఎందుకు అలా

నవ్వేది? తనయింటికి రమ్మనమని అన్నిపనులు ఎందుకుపురమాయించేది? తనంటేయిష్టం; తనంటే సదభిప్రాయం వుందనుకున్నాడు. ఆఖరిరోజు తనక్లాసులోకి వచ్చేసరికి తాను నిద్రపోతున్నాడు. నిజానికి అప్పుడే కునుకుపట్టింది. ఆమె తన్ని చెడామడా తిట్టింది. పిల్లల్ని ప్రశ్నలువేస్తే అందరూ తెల్లబోయి నుంచున్నారు. ఆమె రౌద్రాకారం తాల్చింది. తక్కిన మేష్టర్లందరూ చూస్తూండగా "ఇదేం దూడల్ని కాయడం కాదు వెంకటేశ్వర్లుగారూ. మీకు బ్లాకుమార్కు వేస్తున్నాను" అని చెప్పి వెళ్ళిపోతోంది. తనకి భయంవేసినది. ఆమెవెనకాలే రోడ్డు మీదకు పరుగెత్తాడు. 'మేడమ్ మేడమ్' అంటూ. ఏమిటో కంగారుపడిపోయాడు తను. వినిపించుకోకుండా వెళ్ళే ఆమెకొంగు పుచ్చుకుని 'మేడమ్' అంటూ లాగాడు. ఆమె పైట వూడిపోయింది. అందరూ పక్కున నవ్వారు. ఆమె 'బ్రూట్ బీస్ట్' అని నిప్పులు కురిపించి వెళ్ళిపోయింది. అంతే తన ఉద్యోగం ఊడిపోయింది. ఆమె పైటకన్న బహిరంగంగా అంతకన్న శాశ్వతంగా.

అలా పైట పట్టుకోవడం, లాగడం ఎంతతప్పో తనకి తెలియక కాదు. తనకంగారులో తనకేం చేసినదీ తెలియదు. ఆమెను నిలబెట్టి ప్రాధేయపడాలనే అతని ఉద్దేశ్యం. కాని తాను దురదృష్టవంతుడు. అందుకే పెళ్ళాం దగ్గర్నుంచీ తనని వెధవకింద వాజమ్మకింద చూస్తారు.

తర్వాత ఏవోట్యూషన్లు కుదుర్చుకున్నాడు. కాని ఏవీ నిలబడలేదు. తనలో లోపం ఏమిటో ఒక్కొక్కరే తనదగ్గర మానివేశారు ఎన్నో ఉద్యోగాలకోసం ప్రయత్నించాడు. దొరకలేదు. దొరికినవి నిలబడలేదు. తాను అభిమానాన్ని చంపుకున్నాడు. సినిమా గేటుదగ్గర టిక్కట్లు అమ్మాడు. ఆ ఉద్యోగమూ ఊడిపోయింది. సంచిలో అప్పడాలూ సాంబారుపొడుమూ వేసుకుని యింటింటా తిరిగి అమ్మేవాడు. ఎవరూ తనదగ్గర కొనేవారుకారు తనకి అమ్మజూపే చాకచక్యంలేదు. ఆఖరికి తనభార్య యిక్కడా అక్కడా వంటకు కుదిరి పిల్లల్ని పోషిస్తూ బతికిస్తూ వచ్చింది. తనని నలుగురూ తిట్టేవారు. గడ్డిపెట్టేవారు.

"ముష్టెత్తు - దొంగతనం చెయ్య - అంతేకాని ఆడదాన్ని వీధిలోకి తోస్తావా!" అనేవారు. తాను పొరుగూళ్ళు వెళ్ళాడు. యాచించాడు. కానీ అందరూ అతన్నీ, అతని యాచించే వైఖరినీ సందేహంగాచూసి 'పోవయ్యా పో' అనేవారు. ఇంక దొంగతనం చెయ్యాలనుకున్నాడు. రైలుస్టేషను దగ్గర తారట్లాడేవాడు. ఎలా దొంగతనం చెయ్యాలో తెలి సేదికాదు. ఒకరోజున ధైర్యంచేసి రైలు పెట్టెదగ్గర తోసుకుంటూన్న జనంలో ఒకడి లాల్చీజేబులో చెయ్యిపెట్టాడు ఆ లాల్చీ మనిషి అతని జుట్టు పట్టుకున్నాడు. నలుగురూ గబగబా నాలుగు దెబ్బలు వేశారు. తన నెరుగున్న మేష్టరొకతనువచ్చి "ఇందులో ఏదో పొరపాటు ఉంది. ఇతను అలాంటివాడుకాదు" అని నచ్చచెప్పాడు కాబట్టి కాని లేనిదే తనని చంపేద్దురు.

నలభై ఏళ్లు పైబడిన తాను, తన సభ్యతకీ, స్వభావానికీ విరుద్ధమైన పనులన్నీ బతకడంకోసం చేశాడు. కాని దాని ఫలితంగా మరింత అవ మానాన్ని దుఃఖాన్ని కొనితెచ్చుకున్నాడు.ఇంకా తనిలాగ ఎన్నేళ్లు ఆకలితో బతకగలడు? తన కుటుంబానికి ఏం దారి చూపించగలడు? భయంకరమైన నిస్సహాయత అతన్ని చుట్టుకుంది. అతనికి చీకట్లోకి జారిపోతున్నట్లు చీకటి నీళ్ళలో పీకలోతు మునిగిపోతూన్నట్టు ఉంది. నీరసంవల్ల అతని కాళ్లూ చేతులూ లాగుతున్నాయి. అతనికలా గోడ నానుకుని ఆలోచించే వోపిక కూడా లేకపోయింది

అలా మగతగా నిస్త్రాణగా వున్న అతనికి 'నాన్నా'అన్న పిలుపుతో మెలకువ వచ్చింది. కళ్లుతెరచి చూశాడు. అతని పెద్దకొడుకు - పదేళ్ళవాడు 'అమ్మ రమ్మంటోంది' అన్నాడు.

"ఏం?"

"తింటానికి."

"ఏం తింటానికి?"

"అట్లు."

కొడుకు వెనక్కాలే బయల్దేరి వెళ్ళాడు వెంకటేశ్వర్లు. భార్య అతనికోసం గడపదగ్గర నిరీక్షిస్తోంది. "రాండి. నాలుగు అట్లు తిందురు గాని" అని ఎంతో ఉత్సాహంతో అంది "సూరమ్మ నోము చేసుకుంది. పిల్లలం మేమూ అందరం వెళ్ళి తిన్నాము. ఇంక రేపటివరకూ బాధలేదు. ఈ అట్లు మీ కోసం చీర చెరగులో దాచేసి తీసుకొచ్చాను" అంది అట్లు పెడుతూ. "ఇంకా మొగుడనీ, వాడికి తిండిలేదనీ ఋషిక్కించిన ఈ స్త్రీ ప్రాణిలో మమతా బాధా ఉన్నాయే" అనుకున్నాడు వెంకటేశ్వర్లు. ఆ ఆదరణకే అతని కంఠం రుద్ధమైంది. అట్లు నోట్లో పెట్టుకున్నాడు. అతనికి రుచి తెలియలేదు. ఆకలితో గిలగిల్లాడిన నాలిక ఎండిపోయింది. అయినా గబగబా అన్నీ బొక్కేసి మంచినీళ్ళు తాగాడు. చీకటి పడుతోంది. అతను పెరటి అరుగుమీద చాపమీద పడుకున్నాడు. బాదం చెట్టు కొమ్మల్లోంచి రెండు నక్షత్రాలు కనపడుతున్నాయి. పక్కింటిలోంచి ఏదో పాట విన వస్తోంది. చీకటి నల్లని యిసుకలా రాలుతూ ఆ పాటతో కలిసి అతనికి వొళ్ళంతా గుచ్చుకుంటూన్నట్టు ఉంది. అతనికి నిస్పృహలాంటి మూర్ఛ లాంటి నిద్రపట్టింది.

కాస్సేపటికి భార్యవచ్చి అతన్ని కుదుపుతూంటే మెలకువవచ్చింది. అతను లేచి కూర్చుని 'ఏం' అన్నాడు.

"తొమ్మిదవుతోంది. జయా, రెండవదీ సాయంత్రమే ఎక్కడికో వెళ్ళారు. ఇంకా రాలేదు."

'ఉహూఁ' – తన కెందుకు చెపుతోందీ విషయం!

"ఉహూఁ అంటే చాలా! ఏమైపోయారో ఏమో! కన్న కూతుళ్లు కారా! ద్రాపిలాగ ఉహుఁ అంటావా!"

మళ్ళీ తిట్లు. ఎప్పుడూ తనకి తిట్లే. ఏదో ఒక క్షణం – క్షణంలో సగం – ఆమె కాస్త అనురాగం చూపిస్తుంది. ఆ తర్వాత ఎప్పుడూ కసరడం, తిట్టడం – అవును. ఇంతమంది పిల్లలు ఆకలితో ఆమెని

రంపంలా కోత పెడుతూంటె తల్లి ప్రాణం బాధతో కరడు కట్టుకుని యజమాని అయిన తనమీద, తనచాతకాని తనపు బండరాతిమీద తలకొట్టుకు ఏడుస్తుంది.

పెళ్ళాం కన్నీళ్ళు పెట్టుకుంటూ చెపుతోంది.

"పదిహేడేళ్ళు వచ్చాయి. ఓ ముద్దూ ముచ్చటా ఎరగదు. వీళ్ళయిళ్లకీ, వాళ్లయిళ్లకీ వెళ్లి ఇదిలేదు అదిలేదు అని బతిమాలి ఏదో ఒక పూటకాకపోతే మరొక పూటయినా యింత తీసుకొచ్చి పడేస్తుంది. ఎదిగినపిల్ల - పెళ్ళి పెటాకులు యింకెక్కడ ? తిండిలేకపోతే - పాపం తమ్ముళ్ళని చూసి బాధపడుతుంది. "నాన్న వెర్రివాడే, ఏమీ అనకే; పాపం ఏం చేస్తాడే" అని బాధపడుతుంది. జ్వరమొస్తే పిల్లల్ని ఆచారి గారి దగ్గరికి మోసుకెళ్ళి వైద్యం చేయిస్తుంది. ఇంట్లో ఉంటేనే దానికి ఏదోబాధ, నన్నూ చూసినా, శ్మశానంలాంటి యిల్లుచూసినా. అందుకే ఇక్కడా అక్కడా కూర్చుని వస్తుంది. ఏమిచెయ్యను చెప్పండి. నాకు వంట పని కూడా దొరకటంలేదు."

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తోంది. అతనికి కడుపుమీద కత్తి పెట్టి సన్నగా నాజూకుగా చీలుస్తున్నట్టు వుంది. ఆమెకి చెపుదా మనుకున్నాడు తను చచ్చిపోవాలనుకున్న నిర్ణయం. చటుక్కున ఆమె 'పీడావదుల్తుంది' అంటే - తను చచ్చిపోతూ కూడా సుఖపడలేడు.

అతను చాపమీద పడుకున్నాడు. పెద్దకూతురూ రెండవ కూతురూ వచ్చారు. ఆమె ఏడుపు ఆపి లోపలి కెళ్ళింది. అతను చీకట్లోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు నిజమే. జయకి పెళ్ళి చేసేస్తే ఆమైనా సుఖపడుతుంది. కాని ఎవరు చేసుకుంటారు. ఎలాగ పెళ్ళి చెయ్యడం ! జయ అందమైనది కాకపోయినా అనాకారికాదు. ఇంత దరిద్రం లోనూ బాధ లోనూ యౌవ్వనం విచిత్రంగా పరిపుష్టంగా ఆమెలోకి ప్రవేశించింది.

ఎత్తయిన పిల్లేమో నదరుగా ఉంటుంది. అయితేనేం ఇంత పరమ దౌర్భాగ్యుడి కూతురికి పెళ్ళి ఎలా జరుగుతుంది! ఏ రెండో పెళ్ళివాడైనా మూడో పెళ్ళివాడైనా సరే!.... ఓ పిడికెడు బియ్యం సంపాదించలేని వాడు పెళ్ళికొడుకుని తీసుకురాగలడా! తనకి ఓ గౌరవమా, ప్రతిష్ఠా ఎవడైనా ముసలివెధవైనా గుమ్మం తొక్కడానికి........

ఏదో ఎలక అతని పక్కనుంచే పరిగెత్తినట్టు అతనికి తెలుసును. అంతే. అతనికి నిద్రపట్టేసింది.

2

రెండు రోజులనుండి వెంకటేశ్వర్లు ఇంటికి వెళ్ళడం మానేశాడు. అతని చిన్న కొడుక్కి జబ్బుం చేసింది. ప్రమాదకరమైన జబ్బుచేసింది. వాంతులూ, విరేచనాలూ....తిరిగి తిరిగి వచ్చిన తనకీ విషయం తెలియదు. కాళ్లూ చేతులూ చల్లబడిన పిల్లవాణ్ణి జయ ఆస్పత్రికి తీసుకు వెళ్ళింది. భార్య నడవలో పడుకొని వుంది. ఆమె ఏడుస్తోంది కాబోలు తనకు తెలియదు. వెళుతూనే "ఎక్కడైనా బియ్యం దొరికాయా ఆకలౌతోంది అన్నం పెట్టు" అన్నాడు. ఈమధ్య ఎప్పుడూ అతను అన్నం పెట్టమని అడగలేదు. ఎవరైనా వచ్చి తినమంటే తినేవాడు. లేనిదే అందరూ యింట్లో పస్తు అని గ్రహించి నోరు మూసుకొని పడుండేవాడు. అలాంటిది ఈ వేళ ఎప్పటి చేతకానితనంతో చావు బతుకులలో ఉన్న కొడుకుకోసం ఘూర్ణిల్లే ఆమె దగ్గిరికి వెళ్ళి కులాసాగా "అన్నం పెడతావా" అన్నాడు. ఆమె చటుక్కున ఉగ్రరూపంతో లేచింది. విడిపోయిన జుట్టుతో జ్వలించే కళ్ళతో "ఛా పశువా" అని అరిచింది. అరుస్తూనే పక్కనే ఉన్న చెంబును తనమీదికి బలంకొద్దీ విసిరింది. చెంబు గురితప్పి తలుపుకు తగిలి పిడుగు పాటంత చప్పుడయింది. అతను స్తంభించి పోయాడు. ఏమీ అర్థంకాలేదు. ఆమె నిలువెత్తునా నేలమీద

దొర్లుతూ "కొడుకో" అని మొత్తుకుంటోంది. కొడుకు పోయాడా! అతనికి భయమేసింది. ఇంటిల్లిపాదీ తనచుట్టూ మూగి "నువ్వే హంతకుడివి" అని అరుస్తోన్నట్టనిపించింది. పోలీసులు వచ్చి తనని జైలుకు లాక్కువెళుతూన్నట్టు అనిపించింది. అతను గబగబా యింట్లోంచి వెళ్ళిపోయాడు.

ఎక్కడనుంచో ఎవరినుంచో అతనికి తప్పించుకు పారిపోవాలని పించింది. ఆ రాత్రి అంతా వీధులన్నీ తిరుగుతూ యిక్కడా అక్కడా కూర్చుంటూ కాలం గడిపాడు. ఎక్కడికి పారిపోవడం? ఎవరినుంచి? అని ప్రశ్నించుకున్నాడు. అతనికి మెరుపులా జవాబు తట్టింది. తనను తన బతుకునుంచి, అంతకన్న మార్గంలేదు. మృత్యువే శరణ్యం. అదే అతనికి శాంతి నిస్తుంది. ఈ సమస్యలకు పరిష్కారం సూచిస్తుంది. సత్రం అరుగుమీదికి వెళ్ళి పడుకున్నాడు. ఎలా చావాలో ఎప్పుడు చావాలో నిశ్చయించుకున్నాడు తనుగాని తన కుటుంబంగాని యిక బతకలేదు. బతికే మార్గంలేదు. తానేం చేయలేడని యిదివరకే రుజువైంది. తనంత వెధవ బతుకు బతికి లాభంలేదు. తర్వాత రోజుని రైలుక్రింద తలపెట్టడమే మార్గం అనుకున్నాడు. ఎలా చావాలో ఆలోచించుకుంటూ నిద్రపోయాడు.

బాగా ఎండ మీదపడుతూంటే వెంకటేశ్వర్లుకి మెలకువ వచ్చింది. ముష్టి వాళ్ళందరూ వెళ్ళిపోయారు. వాళ్ళ కుండలు ఎండలో నల్లగా మెరుస్తున్నాయి. వెంకటేశ్వర్లు ఒకసారి తన పెళ్ళాన్నీ, పిల్లల్నీ చూడా లనుకున్నాడు. తన వీధి మొగవరకు వెళ్ళాడు. అతనికి ధైర్యం చాలలేదు. అతని భార్య లోపలికి రానివ్వదేమో! మళ్ళీ ఏమిటి ఈ మమకారం? తన యింటిపక్క వాళ్ళబ్బాయి వస్తున్నాడు. వాణ్ణి ఆపి, "ఏరా మా చిన్నబ్బాయికి జబ్బు చేసిందట. బతికాడా చచ్చిపోయాడా" అన్నాడు.

"బతికాడు. నిన్న సాయంత్రం ఆస్పత్రినుంచి తీసుకొచ్చారు" అంటూ వెళ్ళిపోయాడు. "పోన్లే" అనుకుని వెనక్కి తిరిగాడు. మళ్ళీ

సత్రం అరుగు మీదికి వచ్చాడు. అతనికి తన చిన్నతనం అంతా జ్ఞాపకం వచ్చింది. తనకి కాస్త దెబ్బ తగిలినా జబ్బుచేసినా తల్లి చేసే ఆర్భాటం, ఆదరం, లాలనా అన్నీ జ్ఞాపకం వొచ్చాయి. ఇప్పు డెవరున్నా రతనికి. "ఏం వెంకటేశ్వర్లూ యిలా వున్నావేం, మొహం అలా మాడిపోయిందేం, నాన్నా యీ పాలు తాగు" అని ఎవరంటారు. అతని కేడుపు వచ్చింది. చచ్చిపోదామనుకున్న వెంకటేశ్వర్లు ఆఖరిసారిగా తనమీద తను జాలిపడి ఎంతోసేపు ఏడ్చాడు. మధ్యాహ్నం సత్రం గుమస్తా వీధిలోకి వెళుతూ తన కిచ్చిన రెండరటి పళ్లూ తిని కడుపునిండా నీళ్ళుతాగి గోడనానుకుని కూర్చుండిపోయాడు.

సాయంత్రం అవుతూన్న కొలదీ అతనికి భయం ఎక్కువౌతోంది అతనికి చావడం తప్పదు. ఆ నిర్ణయం మారదు. కాని ఏదో బాధ ఏదో తపి అతనిలో గందరగోళం చేస్తున్నాయి. అతను పళ్ళు బిగబట్టి కళ్ళు మూసుకుని కూర్చున్నాడు, అతని బాల్యం, కాపురం పిల్లలు, బడి, యిన్స్పెక్టరు....అన్నీ అతని మనస్సులో గిర్రున తిరుగుతున్నాయి. రోడ్డుమీద ఏదో శవాన్ని మోసుకుపోతున్నారు. అతను చూడలేక మొహం పక్కకి తిప్పుకున్నాడు. మళ్ళీ ఆకలి మొదలుపెట్టింది.

ఆకలితోపాటు నీరసం. ఆ నీరసంలో వొళ్ళంతా బిగుసుకు పోతూన్నట్టనిపించింది. మళ్లీ ఈ సారి గట్టిగా అనిపించింది చచ్చిపోవ డమే మంచిదని.

చీకటి పడేవేళ అతను లేచాడు. ఇంక గంట మాత్రమే వుంది, రైలు రావడానికీ, తాను చావడానికీ. గబగబా నడవడం మొదలుపెట్టాడు. వంతెన దాటాడు. పొలాలమ్మట పడిపోవడం మొదలుపెట్టాడు. అక్కడ రైలుపట్టాల వద్ద జనసంచారం ఉండదు. స్టేషన్కి మైలుపైగా దూరం వుంటుంది. అక్కడ అటూ యిటూ చెట్లు గుబురుగా ఉంటాయి. రైలు అక్కడ మలుపు తిరుగుతుంది. అక్కడ తల పెట్టితే రైలు వస్తూన్నట్టే తెలియదు. హఠాత్తుగా రైలు మలుపు తిరిగి మీదనుంచి తెలియకుండా పోతుంది. వెంకటేశ్వర్లు పట్టుదలగా రెండు పొలాల మధ్య ఉన్న దారమ్మట నడుస్తున్నాడు.

అరుణ వర్ణంలోనుంచి నలుపులోకి మారుతున్న మబ్బులూ, నల్లగా బొద్దుగా ఉన్న తుమ్మచెట్లు దిగులు దిగులుగా ఏడుస్తూన్నట్లు వీచే గాలి, పిటల, పురుగుల అస్పష్టపు కూతలూ అన్నీ అతన్ని 'చచ్చిపో, చచ్చిపో' అని హెచ్చరిస్తూన్నట్లున్నాయి. ప్రకృతి అంతా అతని చావు కోరుతూన్నట్లు, అతన్ని చావుకి తరుము తూన్నట్లు ఉంది.

"ఏయ్ వెంకటేశ్వర్లూ - నిన్నే ఆగవోయ్" - కేక.

వెనకాల సైకిలుమీద సూర్యనారాయణ. వెంకటేశ్వర్లునిలుచున్నాడు. సూర్యనారాయణ రోజూ బడి వదలగానే అడ్డదారిని అక్కడకి దగ్గర్లో వున్న అత్తవారి వూరు వెళతాడని వెంకటేశ్వర్లుకి తెలుసును.

"ఇలా ఎక్కడికోయ్-" అన్నాడు సూర్యనారాయణ వెంకటేశ్వర్లు మాట్లాడలేదు సూర్యనారాయణ తను పనిచేసిన ఎలిమెంటరీ స్కూల్లో మేష్టరు.

"నీకేమైనా బుద్ధి ఉందా! నువ్వేమైనా మనిషివా!" అన్నాడు సూర్యనారాయణ కోపంగా

హతబుద్ధియై చూస్తున్నాడు వెంకటేశ్వర్లు అతనికి కోపం రాలేదు. సూర్యనారాయణ ఏమంటున్నాడో అర్థంకాలేదు.

"మన కులం మన గౌరవం ఏమైనా నిలబెట్టేట్టున్నావా? నీ మూలాన్ని మేం అందరం తలెత్తుకు తిరగాలా అక్కర్లేదా! ఛీ, సిగ్గుండాలి. కన్న కూతుర్ని పబ్లిగ్గా తారుస్తావా? అచ్చోసిన ఆంబోతులా వదలి వేస్తావా? ఈ వేళ మధ్యాహ్నం సూర్యా లాడ్జిలోంచి వస్తూంటే చూసి నిశ్చేష్టుణ్ణయి పోయాను. వాడు లేడూ బ్రోకర్ వెంకయ్యగాడూ - వాణ్ణి అడిగితే ఆ ఏజంటుగాడికి పదిహేను రూపాయలకి కుదిరింది అని చెప్పాడు. తల కొట్టేసినట్టయి పోయింది. నా కూతురైతే అక్కడే రోడ్డుమీద నరికేసి ఉండేవాణ్ని. ఎందుకురా యిన్నేళ్ళొచ్చి కుటుంబాన్ని అదుపులో పెట్టుకోలేని వాడవు. చావకూడదురా! ఇంకా తగుదు

నమ్మా అని బతికి వున్నావా! నేనయితే రైలుకింద తల పెట్టేసి వుండే వాణ్ని. ఛీ సిగ్గుమాలిన బతుకు. నీదీ ఒక బతుకేనా" అంటూ సూర్యనారాయణ నేలమీద కాండ్రించి ఉమ్మేసి సైకిలెక్కి వెళ్ళిపోయాడు.

వెంకటేశ్వర్లు అలా స్తంభితుడై ఓ అయిదు నిముషాల పాటు సూర్యనారాయణ వెళ్ళిన వైపే వెర్రిగా చూస్తూ నిలుచుని పోయాడు. క్రమంగా అతని మొహంలో ఏదో ఆనందంలాంటి కాంతి కమ్ముకుంది. నిర్జనమైన ఆ పొలాల మధ్య ఫక్కుమని నవ్వేశాడు. "ఇంక నేను చావనక్కర్లేదు" అనుకున్నాడు. నడి సముద్రంలో కొట్టుకుపోతూన్న అతనికి ఏదో నావ దొరికినట్టయింది. అతనికి వెర్రి ఆనందం కలిగింది. ఎవరినేనా కౌగలించుకుని తనకి పట్టిన అదృష్టాన్ని గురించి చెప్పుకోవా లనిపించింది. ఇన్నాళ్ళకి తనకొక దారి దొరికింది. బతకడానికి ఆధారం దొరికింది. ఇక తాను చావనక్కర్లేదు.

వెంకటేశ్వర్లు వెనక్కి తిరిగి కులాసాగా నడవడం మొదలు పెట్టాడు. అతనిలో నీరసం హరించుకు పోయింది. చీకట్లో ఒక్కడూ చేల దారినే నడిచి యింటికి వెళ్ళాడు. నడవలో ఎవరూ లేరు. గదిలోకి తొంగి చూశాడు. పెళ్ళాం, పిల్లలూ అప్పుడే నిద్దట్లో ఉన్నారు. అరె! తనని గురించి వీళ్ళెవరూ ఆలోచించడం లేదా! తన మాటే తన ఉనికే మరచిపోయారా! అతనికి కోపమొచ్చింది. పెరట్లో అరుగుమీదకు వెళ్ళి కూర్చున్నాడు. బాదంచెట్టు కొమ్మల్లో చీకటి దట్టంగా ఉంది. రెండు నక్షత్రాలు కొమ్మల మధ్య మెరుస్తున్నాయి.

"నాన్నా అన్నానికి రా" అని పిలుపు, వెంకటేశ్వర్లు తల పైకెత్తి చూశాడు. తన చిన్న కూతురు పన్నెండేళ్ళది. లేచి ఆమె వెనకాలే వంట యింట్లోకి వెళ్ళాడు. కంచంనిండా అన్నం వుంది వేపుడు ముక్కలు, పచ్చడి, చారు - ఓహ్ చాలా రుచిగా వున్నాయి తృప్తిగా తిని త్రేన్చాడు వెంకటేశ్వర్లు.

నడవలో పడుకున్న వెంకటేశ్వర్లుకి అర్ధరాత్రి మెలకువ వచ్చింది. అతన్ని ఏదో ఎప్పుడూ ఎరుగని సుఖమూ, తృప్తీ చుట్టుకొన్నాయి. అతనికి, అందర్నీ లేపి కబుర్లు సరదాగా చెప్పాలనిపించింది. అతను చిన్నతనంలో నేర్చుకున్న గీత గోవిందం పాట పాడాలనిపించింది. చటుక్కున అతనికి ఏదో తప్పుచేసి నట్లనిపించింది. ఇంత ఆనందానికీ సుఖానికీ కారణమైన పెద్ద కూతుర్ని తా నభినందించ నేలేదు. దగ్గరగా వెళ్ళి "అమ్మా నే సంతోషిస్తున్నాను" అనొద్దూ! తాను కృతఘ్నుడుగా ఎలా ఉండగలడు, అతను లేచి గదిలో చూచాడు. అక్కడ జయలేదు. నాలుగు వైపులా చూచాడు. జయలేదు. పెరటి తలుపు తీశాడు. దొడ్లో బాదం చెట్టు క్రింద జయ కూర్చొని వుంది చవితి నాటి వెన్నెలలో స్పష్టాస్పష్టంగా గోచరిస్తోంది. ఆమె జుట్టు వీడిపోయి మొహంమీద భుజాల మీదా పడుతోంది. ఆమె కాళ్ళలో మొహం పెట్టుకుని వుంది. వెంకటేశ్వర్లు ఆమెవైపు రెండడుగులు వేశాడు. కాని యింతలో ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూన్నట్టు చప్పుడు వినిపించింది. అతనికి అర్థం అవ లేదు. ఓ నిముషం ఆమె వైపు చూసి చప్పుడు కాకుండా వెనక్కి తిరిగి వచ్చి నడవలో పడుకున్నాడు. "ఈ వేళ కాదు మరెప్పుడైనా కృతజ్ఞత చెపుతాను" అనుకుని కళ్ళు మూసుకున్నాడు.

(1967)